క్లుప్తంగా

రైతు బీమా ఓచర్ అందజేత


ఓచర్‌ను అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: నిజాంపేట మండలం పరిధిలోని బాచేపల్లికి చెందిన మహిళా రైతు కర్రె లచ్చవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. రైతు బీమా నామిని అయిన ఆమె కుమారుడు సాయిలుకు రూ.5 లక్షలు ఖాతాలో జమయ్యాయి. ఆదివారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందుకు సంబంధించిన ఓచర్‌ను అందజేశారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రేయారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, మాజీ సర్పంచ్ బాపుసేట్, దుర్గారెడ్డి, అంజిరెడ్డి, సంగయ్య పాల్గొన్నారు.

నేడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు



పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని రామలింగేశ్వర దేవస్థానం, జె.పి కాలనీలోని ఉమామహేశ్వర దేవస్థానం, చైతన్యనగర్ కాలనీలోని మహాదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మహేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహా శివరాత్రి మండల పూజల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే, శ్రీరామలింగేశ్వర దేవస్థానంలో శివస్వాములకు ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


ఆవిష్కరించనున్న అంబేడ్కర్ విగ్రహం

నారాయణఖేడ్: మండలంలోని రుద్రారంలో సోమవారం ఉ.10:30 గంటలకు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేయనున్నట్లు నియోజకవర్గ భీమ్ ఆర్మీ అధ్యక్షుడు అనుముల తుకారాం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ద్విచక్ర వాహనాలతో ప్రదర్శన సైతం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రవాస భారతీయులైన జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చందర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. ఆదివారం గ్రామపెద్దలతో కలిసి విగ్రహం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.

చర్చి నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న పృథ్వీరాజ్

పటాన్‌చెరు: డివిజన్ పరిధి శాంతినగర్‌లోని మెథడిస్ట్ చర్చ్ నిర్మాణానికి ఎండీఆర్ ఫౌండేషన్ రూ. లక్ష విరాళం అందజేశారు. ఎండీఆర్ ఫౌండర్, కోఫౌండర్ పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. ఫౌండేషన్ ద్వారా విద్యా, వైద్యం, ఆధ్యాత్మిక ప్రదేశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ రంజిత్, సెక్రటరీ సోలమన్, భాస్కర్, విల్సన్, జేమ్స్, విక్రాంత్ పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం


ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు గంగ్వార్ మల్లేష్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పాటిల్‌తో పాటు నాయకులు ఓంకార్ యాదవ్, అరుణ్ తదితరులు బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపించాలని కోరుతూ ప్రచారం చేశారు.

దుమ్ముతో ప్రయాణం సాగేదెలా?

మున్సిపాలిటీ పరిధిలోని రేడియల్ రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ద్విచక్ర వాహనదారులు భయంభయంగా ప్రయాణం సాగిస్తున్నారు. రోడ్లపై పేరుకుపోయిన దుమ్ము, ధూళీ, మట్టి రహదారిని తలపిస్తున్నాయి. రోడ్డుపై ఉన్న మట్టి ప్రయాణికుల కళ్లలో పడటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

- దుమ్ము, ధూళీతో ప్రయాణికుల ఇక్కట్లు
- ప్రమాదస్థాయికి మించి కాలుష్యం
- పట్టించుకోని నిర్వహణ అధికారులు


ఉస్మాన్‌నగర్ వెళ్లే మార్గంలో రేడియల్ రోడ్డుపై దుమ్ము


తెల్లాపూర్ రోడ్డుపై దుమ్ముతో నిండిన కారు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రేడియల్ రోడ్లపై పెద్దఎత్తున దుమ్ము, ధూళి పేరుకుపోవడంతో రోడ్లపై ప్రయాణించే వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ప్రధానంగా తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్ ప్రాంతంలో ఈ సమస్య జటిలంగా మారింది. ఈ రోడ్డుపై భారీవాహనాలు, కారులు వెళ్లినప్పుడు పెద్ద ఎత్తున దుమ్ము లేవడంతో ద్విచక్ర వాహనదారుల కళ్లలో దుమ్మపడి ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. దీనికి తోడు రేడి మిక్స్ ప్లాంట్‌లను రోడ్డు పక్కనే ఏర్పాటు చేయడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారయింది. రేడియల్ రోడ్డుపై తీవ్ర వాయుకాలుష్యం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై మట్టి తొలగించకపోతే రానున్న రోజుల్లో ప్రజలు వాయుకాలుష్యంతో రోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారులు వారి సొంత పనులు తప్పా ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. లేని పక్షంలో ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకుపోవడానికి స్థానికులు సిద్ధమవుతున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తా..

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మధుసూదన్‌రావు



మాట్లాడుతున్న అభ్యర్థి మధుసూదన్‌రావు

జహీరాబాద్ టౌన్: ఎస్‌జీటీ ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సంకినేని మధుసూదన్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలో ఎస్‌జీటీయూ ఉపాధ్యాయుల సంఘం నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కీలకమైన వైద్య, విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు లేకపోవడం శోచనీయమన్నారు. 60 శాతం ఉన్న ఎస్‌జీటీలకు ఓటు హక్కులేదని, 40 శాతం ఉన్న స్కూల్ అసిస్టెంట్ టీచర్లకు ఉందన్నారు. ఓటు హక్కులేని కారణంగా టీచర్ ఎమ్మెల్సీలు ఎస్‌జీటీలను చిన్నచూపు చూస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఓటు హక్కులేకున్న పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఓటు హక్కు ఉన్నందున టీచర్ల ప్రోత్సాహంతో స్వంతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు చెప్పారు. తనను ఎన్నికల్లో గెలిపిస్తే సీపీఎస్ విధానం రద్దు, ఎస్‌జీటీలకు ఓటు హక్కు, పాత ఫించన్ విధానం అమలు, మెరుగైన పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న బిల్లులు, డీఏల విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎస్‌టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.మహిపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య, నాయకులు కాశీనాథ్, ప్రభాకర్, షకీల్ అహ్మద్, శివశేఖర్ యూనూస్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాధికాదేవి

జహీరాబాద్ టౌన్: విద్యార్థి దశ నుంచి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ఎంఎల్‌ఆర్‌ఐటీ సైన్స్ అండ్ హ్యూమనిటీస్ శాఖ ప్రొఫెసర్ రాధికదేవి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని గ్రామిక్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికితీసి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. నిత్యజీవితంలో సైన్స్ అనే అంశంపై నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకుంది. 22 పాఠశాలల నుంచి విద్యార్థులు 52 నమూనాలను ప్రదర్శించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త సీఏ ప్రసాద్, అటవీశాఖ అధికారి బాలకృష్ణంరాజు, గ్రామిక విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ శివబాబు ట్రస్టీ డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు


సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాఠశాల యాజమాన్యం

సంగారెడ్డి : సెయింట్ ఆంథోనీస్ పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం ముగిశాయి. పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న ఆంథోనీస్ పాఠశాల 25 వసంతాల రజతోత్సవ వేడుకలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రారంభం నుంచి 25 సంవత్సరాల నుంచి సేవలందిస్తున్న ప్రతి ఒక్కరికీ సర్వీస్ అవార్డులు ప్రదానం చేశారు. ముఖ్యంగా విద్యార్థుల నానమ్మ, తాతయ్యలను వేదికపై చిన్నారులతో నృత్యాలు అందరిని సంతోష పరిచాయి. కృష్ణభాగవతుల, సుబీర్షన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల అధినేత సోలోమోన్‌రెడ్డి , అకాడమిక్ డైరెక్టర్ అరుణారెడ్డి , అడ్మినిస్ట్రేటివ్ హెడ్ జయబాలరెడ్డి, పాఠశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి , వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్‌కుమార్, సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మహానగర సంకీర్తన


నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

జహీరాబాద్: మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో ఆదివారం మహానగర సంకీర్తన కార్యక్రమం వైభవం నిర్వహించారు. 108వ నగర సంకీర్తన హుగ్గెల్లిలో నిర్వహించడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కంది ఇస్కాన్ టెంపుల్, హుగ్గెల్లి హరేకృష్ణ మూమెంట్ సంయుక్తంగా చేపట్టిన కార్యక్రమాన్ని హనుమాన్ దేవాలయం నుంచి ప్రారంభించి గ్రామం అంతా తిరిగారు. చిన్నారుల కోలాటం, మహిళల నృత్యాలు అలరించాయి. అనంతరం విభీషణ్ ప్రభు మాట్లాడారు. సర్వ జగత్తులోని విపత్తులకు హరేకృష్ణ మహా మంత్రమే మూలమన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మాల జపం చేయాలని సూచించారు. గోపాల్ గురూజీ అలపించిన కీర్తనలు అలరించాయి.

ముగిసిన ఉజ్జీవ జాతర

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని హద్నూర్ గ్రామశివారులోని ఈస్టర్ గుట్టవద్ద నిర్వహించిన 25వ మెథడిస్టు క్రైస్తవ ఉజ్జీవ కూటముల జాతర ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు క్వయర్ బృందంచే ప్రత్యేకమైన పాటలు, ఆరాధన, మధ్యాహ్నం వాక్య పరిచర్య కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన క్రైస్తవులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల ప్రజలతో ఈస్టర్ గుట్ట సందడిగా మారింది.

ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి చేయండి


పనులు పర్యవేక్షిస్తున్న జగ్గారెడ్డి, తదితరులు

సంగారెడ్డి జోన్: మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచించారు. ఆదివారం సంగారెడ్డి పాతబస్టాండ్ వద్ద ఉన్న సంగమేశ్వర దేవాలయంలో మరమ్మతులు, రంగులు, హోమం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాయ చైర్మన్ తోపాజి అనంత కిషన్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేష్, సుధాకర్, శ్రీహరి పాల్గొన్నారు

కొనసాగిన మహోత్సవాలు

నారాయణఖేడ్: మండల పరిధి పంచగామ (పంచవటి)లోని శ్రీనాగేశ్వర దేవస్థానంలో ఈ నెల 20 నుంచి ప్రారంభమైన మహాశివరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు సహస్ర రుద్రాభిషేకాలు, రుద్రహోమం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తుల దర్శనం అనంతరం ఆలయ పీఠాధిపతి కాశీనాథ్‌బాబా ఆశీస్సులు పొందారు.

అశోక్‌కు మద్దతుగా బైక్ ర్యాలీ


బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

జహీరాబాద్: టీపీటీఎఫ్, యూటీఎఫ్ తదితర యూనియన్ల మద్దతుతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న అశోక్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఆయా యూనియన్ల నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బి.కొండల్‌రెడ్డి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యమ నేత అశోక్‌కుమార్‌ను గెలిపిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అంతకుముందు జహీరాబాద్ పట్టణంలో ఆయా యూనియన్ల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా యూనియన్ల నాయకులు జ్ఞానమంజరి, జనార్దన్‌రెడ్డి, దుర్గయ్య రాంచందర్ భీంవంశీ, నాగేశ్వరరావు, జీవన్‌రావు, గీతామాలిని, హీరాలాల్, సుభాష్ సింగ్, సోమశేఖర్, సాయిలు, బిచ్చయ్య, వినయపాటిల్, ఎర్షాద్, శామయ్య, సిరాజుద్దీన్, విటల్, సమియుద్దీన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేది కొమరయ్యే..

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ కోరారు. బెజ్జంకిలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేది కొమరయ్యనే అన్నారు. కార్యక్రమంలో శ్రీనివా స్, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు

దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో బసవలింగేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన, లక్ష్మీనరసింహస్వామి ఆలయ గోపురం శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన ఆలయాలు నిర్మాణంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందన్నారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ హనుమంత్‌రెడ్డి, సాయికిరణ్‌రెడ్డి, బీరప్పయాదవ్, సతీష్‌శ్రీకాంత్ యాదవ్, శైలజ, పుండరీకం, నాయకులు రత్నం, విజయారెడ్డి, జనార్దన్, సాయి, శారద స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర

రామచంద్రాపురం, (పటాన్‌చెరు): శ్రీనివాస్‌నగర్ కాలనీలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో మల్లన్న జాతర, కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మహిపాల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పోచమ్మతల్లి ఆలయ 4వ వార్షికోత్సవం కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. కార్పొరేటర్ పుష్ప పాల్గొన్నారు.

సనాతన ధర్మమే నిలుస్తుంది..


మహాపాదయాత్రలో శివదీక్షాధారులు

నారాయణఖేడ్: సనాతన ధర్మమే నిలుస్తుంది.. గెలుస్తుందని దుద్యాల ఆశ్రమ పీఠాధిపతి అంబిక శివయోగి మహరాజ్, సిద్దిపేట విశ్వబ్రహ్మేంద్ర ఆశ్రమ పీఠాధిపతి ధర్మధ్వజ మహరాజ్, బ్రహ్మశ్రీ గరురాజశర్మలు అన్నారు. నియోజకవర్గంలోని శివదీక్షాధారులు ఆదివారం ఖేడ్ జంటగ్రామం మంగల్‌పేట్‌లోని దుర్గాభవానీమాత ఆలయం నుంచి పట్టణంలోని కాశీనాథ్ ఆలయం వరకు మహాపాదయాత్ర, కాశీవిశ్వనాథస్వామివారికి జలాభిషేకం నిర్వహించారు. ప్రవచనాల్లో భాగంగా వారు మాట్లాడుతూ.. శివుడిని ఆరాధిస్తే అన్ని శుభాలు కలుగుతాయని అన్నారు. మహాపాదయాత్ర ఆధ్యాత్మిక శివతత్వాన్ని పెంపొందించిందన్నారు.

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను నమ్మొద్దు

ప్రజాశక్తి పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి దొడ్ల వెంకట్


మాట్లాడుతున్న అభ్యర్థి వెంకట్

సదాశివపేట(సంగారెడ్డి): కాంగ్రెస్, బీజేపీ పట్టభద్రుల అభ్యర్థులను నమ్మి ఓటు వేయొద్దని తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి దొడ్ల వెంకట్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి విద్యా విధానాన్ని భ్రష్టుపట్టించి ఫీజుల రూపంలో విద్యార్థుల రక్తాన్ని పీలిస్తున్న నరేందర్‌రెడ్డికి ఓటు వేస్తే వారి ఆగడాలకు అడ్డు అదుపు ఉండదని ఇలాంటి వారిని ఓడించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి గెలిచిన తరువాత ఏ పార్టీలో ఉంటాడో ఆయనకే తెలియదని ఇలాంటి వారికి ఓటు వేయడం దండగని విమర్శించారు. ఒక్కసారి నాకు అవకాశం ఇస్తే అన్ని వర్గాలకు న్యాయం చేయడంతో పాటు విద్యా విధానాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ గాడ్గే జయంతి వేడుకలు


గాడ్గే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్: ప్రముఖ సంఘ సంస్కర్త వాగ్గేయకారుడు సంత్ గాడ్గేబాబా జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఐలమ్మచౌక్ వద్ద ఆయన చిత్రపటానికి రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రజక సంఘం సమితి అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ.. గాడ్గే బాబా ఆధ్యాత్మిక విషయాలను బోధించడంతో పాటుగా సాంఘిక సమస్యల గురించి ప్రజల్లో చైతన్యం కలిగించేవారని అన్నారు. ఆయన ఏ గ్రామానికి వెళ్తే ఆ గ్రామంలోని మురికి, చెత్తను శుభ్రపరిచేవాడన్నారు. పరిశుభ్రతకే తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తిగా పేరు పొందారని తెలిపారు. సంత్ గాడ్గే బాబాకి భారత రత్న ఇవ్వాలని నగేష్ కోరారు. కార్యక్రమంలో జిల్లా టీజీఓ అధ్యక్షుడు వైద్యనాథ్, ఫోరమ్‌ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్, సజ్జద్‌ఖాన్, మహేష్‌కుమార్, పండు రంగం, సాయి, రజక సంఘం సమితి నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికే సీపీఎం మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న జయరాజు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: మెదక్, నిజామాబాద్, కరీంనగర్, అదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు పిలుపునిచ్చారు. ఆదివారం సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి సీపీఎం సంపూర్ణ మద్దతిస్తుందని, నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. మతోన్మాదం బీజేపీ అభ్యర్థిని ఓడించాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాణిక్యం, రాజయ్య, మల్లేశం, రామచందర్, సాయిలు, నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్, నాగేశ్వర రావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని కుప్పానగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో సన్మానించి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మారుతిరావు, ఉపాధ్యాయులు మహేశ్వర్, ప్రతాప్‌రెడ్డి, విజయలక్ష్మి, శోభ, సునీత, పూర్వవిద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.